# రక్తదానానికి ముందుకు రావాలి

ఎదులాపురం, అక్టోబర్ 2 : రక్తదానానికి యువత ముందుకు రావాలని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ, శ్రీ కృషి మిత్ర స్వచ్ఛంద రక్తదాన సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు రక్తదాన శిబిరాలు కూడా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, డాక్టర్లు తిప్పస్వామి, శ్యాంప్రసాద్, సొసైటీ సభ్యులు అబ్దుల్ శాకూర్, రాణాప్రతాప్, శ్రీకాంత్, భగవాండ్లు, ఉత్తమ్ రావ్, గణేశ్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో, రిమ్స్ డైరెక్టర్

# జిల్లా, జోనల్ స్థాయి ఆర్చరీ పోటీలు



ఆర్చరీ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 2: ఖానాపూర్‌లో సోమవారం ఎస్‌జీఎఫ్–2023 జిల్లా, జోనల్ స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించారు. అండర్–14, 17, 19 విభాగాల్లో నిర్వహించిన ఆర్చరీ పోటీలకు 100 మంది బాలబాలికలు హాజరయ్యారు. వీరిలో నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు 32 మంది విద్యార్థులు ఎంపికయ్యారని అధికారులు తెలిపారు. వీరంతా అక్టోబర్ మూడో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో పెటా సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేశ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణారావు, పీడీలు బాపురావ్, క్రాంతి, పీఈటీలు పోశెట్టి, రవీందర్ గౌడ్, మారుతి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలోనే ఆలయాల పురోభివృద్ధి



నేరడిగొండ: గ్రామస్తులకు ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న జాదవ్ అనిల్

నేరడిగొండ, అక్టోబర్ 2 : సీఎం కేసీఆర్ హయాంలోనే ఆలయాలు పురోభివృద్ధి సాధిస్తున్నాయని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం సావర్గాం గ్రామంలోని జగదాంబదేవీ, సేవాలాల్ మహారాజ్ ఆలయాల దగ్గర షెడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు ప్రొసీడింగ్ కాపీని సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ మండల కన్వీనర్లు అల్లూరి శివారెడ్డి, తోట వెంకటేశ్, మేకల నాగయ్య యాదవ్, సర్పంచ్ జాదవ్ కళ్యాణీమహేందర్, గ్రామస్తులు విఠల్, గణేశ్, అంబాజీ, దూప్‌సింగ్, నాను, గణపతి, కృష్ణ పాల్గొన్నారు.

### బంగ్లా నిర్మాణానికి రూ.5 లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేత

భీంపూర్, అక్టోబర్ 2 : భీంపూర్ మండలం గుబ్‌డి గ్రామంలో సవారీ బంగ్లా నిర్మాణానికి సోమవారం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ రూ.5లక్షల ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఎమ్మెల్సీ నిధుల నుంచి మంజూరయ్యాయని అడ్డి భోజారెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, సర్పంచ్ ఎల్ములు ప్రతాప్ , నాయకులు కృష్ణ, ఏనుగు అశోక్‌రెడ్డి, బక్కి కపిల్, నవీన్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 2: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ అన్నారు. గాంధీ జయంతి పురస్కరించుకొని నిర్మల్‌లోని రాంనగర్ ఆరోగ్య కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం అనేక రకాల పథకాలు అమలు చేస్తున్నదన్నారు. రక్తహీనతకు చికిత్స, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, అన్ని రకాల రక్తపరీక్షలు, అసంక్రమిత వ్యాధులు, బీపీ షుగర్‌కు ప్రతి నెలా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కు రేషన్‌కార్డుదారులందరు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ రఘువీర్, వైద్యాధికారి శ్వేత, మాస్ మీడియా విస్తరణాధికారి రవీందర్, మతిన్, సీహెచ్‌వో రమణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘర్షణలో పలువురికి గాయాలు



ఘటనా స్థలం వద్ద పహారా కాస్తున్న పోలీసులు

కుంటాల, అక్టోబర్, 2: మండల కేంద్రంలో ఆదివారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణతో కొంత ఉద్రిక్తత ఏర్పడింది. పాత కక్షలతో ఒక వ్యక్తి, అతని కుమారులు కొందరిపై కర్రలతో దాడి చేశారు. ఒక వర్గానికి చెందిన అఖిలేశ్, అన్వేశ్, రాకేశ్‌లకు మరోవర్గానికి చెందిన గంగాధర్‌కు గాయాలయ్యాయి. వెంటనే కుంటాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో భైంసా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు అన్నారు. భైంసా రూరల్ సీఐ నైలు, కుభీర్ ఎస్ఐ షరీఫ్ కూడా ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఒక వర్గానికి ప్రాణ భయం ఉండడంతో పోలీసులు వారిని సురక్షిత కస్టడీలో ఉంచారు. ఘటనా స్థలం వద్ద పోలీసులు పహారా ఉంచారు. పరస్పర ఫిర్యాదులపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హన్మండ్లు తెలిపారు.

## నర్సాపూర్(జీ)లో గ్రామసభ

నర్సాపూర్(జీ), అక్టోబర్ 2: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ప్రతి కుటుంబ సభ్యుడికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుందని దీనిని వినియోగించుకోవాలని సర్పంచ్ రాంరెడ్డి సూచించారు. అనంతరం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చిన్న రామయ్య, ఆర్‌బీఎస్ జిల్లా సభ్యులు రమేశ్, ఎంపీటీసీ మల్లేశ్, గంగారాం, రాము, కోఆప్షన్ సభ్యుడు ఫసి, రాజు, అమరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జైనథ్, అక్టోబర్ 2 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం భోరజ్ గ్రామంలోని తెలంగాణ దాబా సమీపంలో సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. నీలి రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడని, టీ షర్ట్ వెనుక భాగాన డాల్మియా సిమెంట్ అని రాయబడి ఉందని, నల్లని ప్యాంటు, మృతుని వయసు 45 సంవత్సరాలు ఉందన్నారు. భోరజ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని గుర్తు పట్టిన వారు జైనథ్ ఎస్ఐ 8712659929, సీఐ 8712659916 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తాంసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన డీఎస్పీ ఉమేందర్

తాంసి, అక్టోబర్ 2 : ఆదిలాబాద్ జిల్లాలోని పోలీసులు నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ ఉమేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. మండల స్థితిగతుల వివరాలపై ఆరా తీశారు. శాంతిభద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ సైదారావ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఆయన వెంట ఎస్ఐ శివరాం, పోలీసులు ఉన్నారు.

## బంజారా జాతిరత్న బానోత్ జాలంసింగ్ పుస్తకావిష్కరణ



బంజారా జాతిరత్న బానోత్ జాలంసింగ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి

ఉట్నూర్, అక్టోబర్ 2 : నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డిని ఉట్నూర్ సాహితీ వేదిక రచయితలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కలెక్టర్ చేతుల మీదుగా బంజారా జాతిరత్న బానోత్ జాలంసింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహితి వేదిక కవులు, రచయితలు కవన కోకిల జాదవ్ బంకట్‌లాల్, ముంజం జ్ఞానేశ్వర్, రాథోడ్ భీంరావ్, కట్టా లక్ష్మణచారి, ఇందల్‌సింగ్, రాథోడ్ శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

# 8న ఆదివాసీ సేన ఉమ్మడి జిల్లాల సమావేశం

గుడిహత్నూర్, అక్టోబర్ 2 : గుడిహత్నూర్ మండలం రాఘాపూర్ గ్రామంలో ఈ నెల 8వ తేదీన ఆదివారం ఆదివాసీ సేన ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆదివాసీ సేన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాయిసిడాం జంగు పటేల్, తొడసం లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలలోని ఆదివాసీ సేన, ఆదివాసీ విద్యార్థిసేన, మహిళాసేన, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.